క్లుప్తంగా

రంగనాథస్వామి ఆలయ ఈఓగా వీరయ్య



మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారిగా వీరయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఓర్వకల్లుకు బదిలీ కాగా ఆయన స్థానంలో నంద్యాల జిల్లా గోస్పాడు దేవాలయ సముదాయం నుంచి వీరయ్య బదిలీపై వచ్చారు. నూతన ఈఓ మాట్లాడుతూ దాతలు, గ్రామ ప్రజల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

మోస్తరు వర్షం



గూళ్యంలో ప్రవహిస్తున్న వర్షపునీరు

హాలహర్వి: మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని హాలహర్వి, గూళ్యం, విరుపాపురం, నిట్రవట్టి, పచ్చారపల్లి గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా, ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గూళ్యం గ్రామంలోని ప్రధాన రహదారిపై నీరు చేరడంతో వాహనాలు నీటిలో ఇరుక్కుపోయాయి.

పిచ్చి మొక్కల తొలగింపు



జేసీబీతో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని బేవినహాల్ గ్రామంలో గృహాల సముదాయంలో మొలిచిన పిచ్చి మొక్కలను సర్పంచ్ కె.జయశ్రీ ఆదివారం తొలగింపజేయించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలపై అపుస్మా సమావేశం



మాట్లాడుతున్న నాగార్జున

హొళగుంద: తాలూకా స్థాయి ప్రైవేటు పాఠశాలల సమస్యలపై ఆదివారం స్థానిక నేతాజీ పాఠశాలలో అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆలూరు యూనిట్ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా అపుస్మా లీగల్ సెల్ స్టేట్ మెంబర్ నాగార్జున, కర్నూలు జిల్లా వైస్ ప్రెసిడెంట్ రఘునాథ్, జాయింట్ సెక్రటరీ గురునాథ్, ఆదోని, ఎమ్మిగనూరు యూనిట్ సెక్రెటరీలు గిరిరాజు, రామలింగయ్య హాజరయ్యారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల సమస్యలు, పరిష్కారాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు కరెస్పాండెంట్లు లేవనెత్తిన సందేహాలను నాగార్జున నివృతి చేశారు. కరెస్పాండెట్లు, హెచ్ఎంలు గోపీనాథ్, మల్లికార్జున, చిదానంద, వీరేశ్, లక్ష్మన్న, పీరా, సాధిక్, అబిబుల్లా పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమలో కార్మికులను తొలగించొద్దు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ వైపు అడుగులేస్తూ కార్మికులను తొలగించేందుకు పూనుకుంటే సహించేది లేదని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో 4,290 మంది కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం గేట్‌పాస్‌లు వెనక్కు తీసుకోవడం చూస్తే ప్రైవేటీకరణకు అడుగులేస్తున్నట్లు కనిపిస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై పునరాలోచించి తమ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎల్లప్ప, సుంకన్న, నరసప్ప, విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు లేనట్టే !

- అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని పింఛన్ వెబ్‌సైట్
- అధికారులు, కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- ఉన్నవాటిని తొలగించే యోచన
- గతంలో నిరంతరాయంగా దరఖాస్తుల స్వీకరణ, ఆరు నెలలకోసారి లబ్ధిదారుల గుర్తింపు
- నియోజకవర్గంలో 34,796 మంది పింఛన్ లబ్ధిదారులు

సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం చతికిల పడింది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక మాటలతో పబ్బం గడుపుతోంది. ముఖ్యంగా అక్టోబర్ నుంచి నూతన పింఛన్లను మంజూరు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు.. చివరకు పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను పునరుద్ధరించలేదు. దీంతో నూతన పింఛన్ల కోసం గ్రామాల్లో అర్హులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇక.. ఉన్న పింఛన్లను తొలగించేందుకు నాయకులు కుట్ర చేస్తున్నారు. తమకు నచ్చని వారి జాబితా తయారు చేసి గ్రామ సభల ద్వారా తొలగించడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

మండలాల వారీగా పింఛన్ లబ్ధిదారులు	
మండలం	లబ్ధిదారులు
ఆలూరు	7,183
ఆస్పరి	6,177
చిప్పగిరి	3,499
హాలహర్వి	6,003
హొళగుంద	4,485
దేవనకొండ	7,449



కాత్రికి గ్రామంలో వృద్ధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఆలూరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు.ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికీ కూడా నూతనంగా పింఛన్ మంజూరు చేయకపోయినా.. ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అర్హత ఉన్నా ఎదురుచూపులే..

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు నియోజకవర్గంలోని 96 సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటి వరకు సంబంధిత వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో.. ప్రభుత్వం నుంచి సమాచారం అందలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం నిత్యం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముండేది. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రతి ఆరు నెలలకోసారి లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డు వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపి వేసింది.

వంద రోజులైనా తెరుచుకోని సైట్..

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత వైబ్‌సైట్ సేవలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకేనేందుకు వచ్చే వారికి సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర..

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లు తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. అక్టోబర్‌లో గ్రామ సభలు పెట్టి అనర్హత పేరుతో పింఛన్లు తొలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలొస్తున్నాయి.

> **ఇది చేతల ప్రభుత్వం కాదు**
>
> 
>
> అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను విస్మరించింది. సూపర్ సిక్స్ అమలు ఓ బూటకం. ఎప్పటిలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేశాడు. ఎన్నికలు ముగిసి నాలుగు నెలల అవుతున్నా.. పింఛన్ వైబ్‌సైట్ తెరుచుకోలేదు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో అర్హులు నూతన పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త పింఛన్లు మంజూరులో జాప్యం తగదు. పింఛన్ల తొలగింపు కుట్రను కూటమి నాయకులు మానుకోవాలి. ప్రభుత్వ పెద్దలు కేవలం ప్రకటనలు, ఆరోపణలు, అసత్య ప్రచారాలకే పరిమితమవుతున్నారు. చేతల్లో మాత్రం నిబద్ధత కొరవడింది.
>
> – విరూపాక్షి, ఎమ్మెల్యే,ఆలూరు,

నేటితో ఈ-కేవైసీ గడువు ముగింపు

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ- కేవైసీ నేటితో గడువు ముగుస్తుందని, ఇంకా ఎవరైనా రైతులు ఉంటే వెంటనే చేయించుకోవాలని ఏఓ రవి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..మండలంలోని 8 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 94 శాతం ఈ-కేవైసీ పూర్తి చేసినట్లు చెప్పారు. వ్యవసాయాధికారులు కూడా ఈ-కేవైసీ చేయని వారికి సమాచారమివ్వాలని సూచించారు.

మాళ మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి మూలమూర్తులకు ఆదివారం పత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పూజారులు స్వామి వార్లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే ఆస్పరి మఠంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలో రెండు జూనియర్ సివిల్ కోర్టులు, 11 పోలీస్ స్టేషన్లు, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేస్తే కేసులు పెండింగ్‌లో ఉండే అవకాశం ఉండదన్నారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. ఇప్పుడు మళ్లీ అదే హామీ ఇచ్చి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. పదేపదే హామీ ఇవ్వకుండా ఈ సారైనా హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

గురుకుల క్వార్టర్స్ శిథిలం



శిథిలావస్థకు చేరిన అధ్యాపకుల క్వార్టర్స్



కూలేందుకు సిద్ధంగా ఆరోగ్య కేంద్రం

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామ సమీపంలో 1984లో బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర (ఎస్సీ) గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. నాడు ఇక్కడ 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేవారు. క్రమేణా విద్యార్థుల సంఖ్య పెరగడం, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఊపందుకోవడంతో 1993లో పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాల ప్రారంభ సమయంలో ఉపాధ్యాయులు స్థానికంగానే ఉండి బోధన సాగించేందుకు ప్రభుత్వం క్వార్టర్స్ నిర్మించి ఇచ్చింది. ఇందులో 17 గృహాలు ఉపాధ్యాయుల కోసం మరో 6 ఇళ్లు నాన్ టీచింగ్ స్టాఫ్ కోసం కేటాయించారు. నాటి నుంచి క్వార్టర్స్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. దీంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పైకప్పులు పెచ్చులూడుతుండటం, వర్షం నీరు గోడల్లోకి దిగి ఇల్లు చెమ్మపడుతున్నాయి. దీంతో గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్మించిన ఆరోగ్య కేంద్రం కూడా పూర్తిగా శిథిలమైంది. పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు, సిబ్బంది లోపలికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఇక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

> **మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం**
>
> పాఠశాల, కళాశాలలో కలిసి 548 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడి బోధన సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నది వాస్తవమే. గదుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సంబంధిత కార్పొరేషన్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. గదుల విషయాన్ని డీసీఓ శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లాం. – శ్రీనివాసరెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

పెద్దకడబూరు : మండల కేంద్రంలో గత బుధవారం విద్యుదాఘాతంతో గుడిసె కాలిపోయి సర్వం కోల్పోయిన మంచోది శాంతిరాజు కుటుంబానికి అండగా ఉంటామని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు భరోసానిచ్చారు. ఈ మేరకు ఆదివారం సంస్థ సభ్యులు ప్రసన్నరాజు దంపతులు రూ. 22వేలు నగదును అందజేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు పెద్దకడబూరు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రవీణ్, సుధాకర్, ప్రకాష్, రామచంద్ర, నందవరం జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

మద్దికెర : స్థానిక చౌడేశ్వరిదేవి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3 నుంచి 12 తేదీ వరకు పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం అమ్మవారికి ఉదయం 9 గంటలకు కుంకుమార్చన, రాత్రి ప్రత్యేక పూజలతో పాటు రోజూ ప్రత్యేక అలంకరణలో అలంకరించి పూజలు చేపడతామని చెప్పారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, జోహరాపురం, రామతీర్థంలో వెలసిన మారెమ్మవ్వ, పెద్దమ్మవ్వ, పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరీమాత, గాయత్రీ మాత ఆలయాల్లో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు రూపామోహన్‌శర్మ, సతీష్ ఆచారి, మల్లికార్జునస్వామి, శాంతిరెడ్డి, గోవిందు ఆదివారం తెలిపారు. 3న బాల త్రిపురసుందరి, 4న గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న మహాలక్ష్మిదేవి, 7న లలిత త్రిపురాసుందరీ దేవి, 8న సరస్వతీ దేవి, 9న లలితా దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధిని, 12న రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో అమ్మవార్లు దర్శనమివ్వనునుట్లు చెప్పారు. వేడుకలకు ఆలయాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.



:ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి



ఆస్పరిలో వెలసిన మారెమ్మవ్వ

ఉరుసుకు ఏర్పాట్లు పూర్తి



భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉరుసును భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని, ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామని సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గప్ప, ఎస్కే గిరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్యాంకర్‌తో మంచినీటి సరఫరా, దర్గా పరిసరాలు, వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. తాగునీటి వసతి, వీధిలైట్లు, డ్రైనేజీలలో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించారు. భక్తుల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.



దర్గా ప్రధాన వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దృశ్యం

మార్కెట్‌లో అక్రమాల జోరు

- ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో దళారుల పెత్తనం
- కమీషన్ ఏజెంట్లు.. వ్యాపారులు కుమ్మక్కు
- సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్న వ్యాపారులు
- అధికంగా కమీషన్ వసూలు
- జోరుగా జీవో వ్యాపారం



యార్డ్‌కు విక్రయానికి వచ్చిన దిగుబడులు



మార్కెట్ బయట విక్రయాలు ఇలా..

ఎమ్మిగనూరు:దళారుల పెత్తనం.. వ్యాపారులు–ఏజెంట్లతో కుమ్మక్కైన అధికార యంత్రాంగం వల్ల అన్నదాత దగా పడుతున్నాడు. మార్కెట్‌యార్డులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్టపడకపోవడం, బహిరంగ మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలకు అధికార యంత్రాంగం పచ్చజెండా ఊపి రైతన్నను నిలువునా ముంచుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోగా.. రైతులను మోసగించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఏజెంట్ మాఫియాకు కేంద్రంగా మారిన ఎమ్మిగనూరు వ్యవసాయమార్కెట్ యార్డులో అన్నదాత ఆక్రందనలు నిత్యకృత్యమయ్యాయి.

ఉత్తమ మార్కెట్‌గా గుర్తింపు

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు జిల్లాలోని ఉత్తమ మార్కెట్లలో ఒకటిగా ప్రత్యేక గుర్తింపుంది. ఇక్కడికి ఎమ్మిగనూరుతో పాటు ఆలూరు, పత్తికొండ, డోన్, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాలతో పాటు కర్ణాటకలోని రాయచూరు జిల్లా, తెలంగాణ నుంచి అలంపూరు నియోజవకవర్గం నుంచి దిగుబడులు విక్రయానికి తీసుకువస్తుంటారు. ఎక్కువగా వేరుశనగ, పత్తి, కందులు, మొక్కజొన్న, శనగ, ఆముదాలు విక్రయానికి తీసుకొస్తుంటారు. ఆదివారం మార్కెట్‌కు 2,346 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ట ధర రూ.6,290 పలికింది. ఆముదాలు 1033 క్వింటాళ్లు రాగా ధర రూ.5,810 ఉంది. వేరుశనగ వారానికి సగటున 8వేల క్వింటాళ్లు, సీజన్ మొత్తంలో 40 నుంచి 50 వేల క్వింటాళ్లు వస్తుంది.

రైతుకు దక్కని భరోసా

ఎమ్మిగనూరు మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న భరోసా ఉండేది. కానీ ఇది గతం. ప్రస్తుతం ఇక్కడ కూడా రైతన్న దగా పడుతున్నాడు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు సిండికేట్‌గా మారి ధరలను పూర్తిగా తగ్గించేస్తున్నారు. దీనికి తోడు యార్డ్‌లో జరిగే క్రయ విక్రయాల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఖరీఫ్, రబీ అనీ తేడాలేకుండా దిగుబడులు మార్కెట్‌కు భారీగా తరలుతున్న కొద్దీ గిట్టుబాట ధర రోజురోజుకు పతనమవుతోంది. ఈ- నామ్‌ను సైతం ఏమార్చుతున్నారు. అలాగే 2శాతం కమీషన్ ఉండగా నిబంధనలకు విరుద్ధంగా 4 నుంచి 8 శాతం వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యమే.

> **జోరుగా జీరో వ్యాపారం**
>
> రైతులను దగా చేయడమేకాక మరో పక్క యార్డ్ ఆదాయానికి సిబ్బంది సహకారంతో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు గండిపెడుతున్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన సరుకును అరైవల్ రిజిష్టర్‌లో నమోదు చేస్తూ బిల్లు వేయాల్సి ఉండగా ఇందులోనూ అక్రమాలకు తెరలేపుతున్నారు. కొంత సరుకును రిజిష్టర్‌లో నమోదు చేయకుండా జీరో వ్యాపారాన్ని సాగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక యార్డ్‌లో దుకాణాలకు లైసెన్సులు తీసుకున్న కొద్ది మంది వ్యాపారులు, అలాగే ఎలాంటి లైసెన్సు లేని వారు కూడా ఇతరుల పేరుతో కొనుగోలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. మార్కెట్‌యార్డులో పత్తి మార్కెట్‌ను మూసేయడంతో కాటన్ మిల్లులతో పాటు, ప్రైవేటు వ్యక్తులు పలు ప్రాంతాల్లో సమాంతర మార్కెట్‌ను నడుపుతున్నారు. 10 బస్తాలలోపు సరుకు ఉన్న రైతులు పట్టణ శివారులో ఉన్న యార్డ్‌కు తీసుకువెళ్లకుండా కమీషన్ ఏజెంట్లు పట్టణంలో అక్రమంగా క్రయవిక్రయాలు నడుపుతున్న వ్యాపారుల వద్ద విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారస్తులతో యార్డ్ అధికారులు లాలూచి పడటంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు..ఆరుకాయలుగా సాగుతోంది. బయట సరుకును కొనుగోలు చేస్తున్న వ్యాపారులు యార్డ్‌కు సెస్సును చెల్లించకుండా నేరుగా జీరో వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

బైలాను పక్కనపెట్టి రూ.2 వడ్డీ వసూలు

మార్కెట్ యార్డ్ బైలా ప్రకారం రైతు వద్ద నుంచి కొనుగోలు చేసిన సరుకుకు కమీషన్ ఏజెంట్లు 24 గంటల్లోపు ఎలాంటి వడ్డీని మినహాయించుకోకుండా డబ్బు చెల్లించాలి. కానీ ఇక్కడ కమీషన్ ఏజెంట్లు 24గంటల్లోపు రైతులు డబ్బు అడిగితే రూ.2 వడ్డీని మినహాయించుకొని చెల్లించాల్సిన మొత్తాన్ని ఇస్తున్నారు. వడ్డీ లేకుండా డబ్బు కావాలంటే నెలరోజులు గడువును విధిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలను మార్కెట్‌లో ఏర్పాటు చేసినా రైతుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని నంబర్ గేమ్‌తో తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. గిట్టుబాటు ధర కల్పించకపోగా అధిక దళారీ, డబ్బు చెల్లింపులో అక్రమాలు, తూకాల్లో మోసాలు ఇలా యార్డ్‌లో రైతు దగాపడుతున్నాడే తప్ప రైతు సంక్షేమం కనిపిస్తే ఒట్టే.

> **ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**
>
> యార్డ్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు రైతులు గుర్తించి నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. 24 గంటల్లోపు సరుకు కొనుగోలుకు సంబంధించిన డబ్బు రైతుకు చెల్లించాల్సిందే. బయట జరుగుతున్న అక్రమవ్యాపారులపై దాడులు చేసి కేసులు నమోదుచేస్తాం.
>
> – పద్మావతి, యార్డ్ కార్యదర్శి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఏపీ గురుకుల విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు సింధూర, అశ్విని

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికై తమ సత్తా చాటుకున్నారు. ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ సామ్రాజ్యం మాట్లాడుతూ పాఠశాలలో 300 మీటర్ల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కె. సింధూర, 200 మీటర్ల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని కె.అశ్వినిలు తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులతో పాటు పీఈటీ ప్రభావతిని ప్రిన్సిపాల్ అభినందించారు.

తప్పిపోయిన పిల్లలు తండ్రి చెంతకు



తండ్రి ఇస్మాయిల్‌తో కుమారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఖాజీపురం కాలనీకి చెందిన ఇస్మాయిల్ కుమారులు సోహోల్, ఇస్మాయిల్‌లు ఆదివారం ఉదయం ఆడుకుంటూ తప్పిపోయారు. ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా పిల్లల ఆచూకీ తెలియలేదు. దీంతో వెంటనే ఆదోని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తండ్రి ఇస్మాయిల్ తెలిపారు. విచారణ చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు పిల్లలను వెతికి పట్టుకుని తండ్రికి అప్పగించారు.